


# అల్లకల్లోలం


## ట్రంప్ సృష్టించిన బీభత్సానికి కుప్పకూలిన సూచీలు

- భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా భీకర నష్టాల్లో స్టాక్ మార్కెట్లు
- ఒక్కరోజే సెన్సెక్స్ 2,227, నిఫ్టీ 743 పాయింట్లు క్షీణత
- ఇంట్రా-డేలో 3,940.. 1,161 పాయింట్లు పతనం
- రూ.14.10 లక్షల కోట్లు కరిగిపోయిన మదుపరుల సంపద
- ఒకానొక దశలో రూ.20.16 లక్షల కోట్లు ఆవిరి
- మెటల్, రియల్టీ, కమోడిటీ, ఇండస్ట్రియల్ షేర్లు కుదేలు




*ట్రంప్ దూకుడుకు దీటుగా చైనా, మరికొన్ని దేశాలు స్పందిస్తున్నాయి. దీంతో స్టాక్ మార్కెట్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఫలితంగా అమెరికా, ఆసియా, ఐరోపా సూచీల్లో భారీ అలజడే నెలకొంటున్నది. వాణిజ్య యుద్ధం భయాల నడుమ మదుపరులు అమ్మకాలకు తెగబడుతున్నారు. సోమవారం భారతీయ సూచీలు భీకర నష్టాలను చవిచూడగా.. ఈ ఒక్కరోజే సెన్సెక్స్ 2,227, నిఫ్టీ 743 పాయింట్లు పతనమైపోయాయి. మదుపరుల సంపద కూడా లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది.*

- 2024 జూన్ 4న మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ 4,389.73 పాయింట్లు (5.74 శాతం), నిఫ్టీ 1,379.40 పాయింట్లు (5.93 శాతం) క్షీణించాయి. ఒక్కరోజే ఈ స్థాయిలో నష్టాలు మళ్లీ ఇప్పటిదాకా ఎప్పుడూ వాటిల్లలేదు.
- ఇదే రోజున ఒకానొక దశలో సెన్సెక్స్ ఏకంగా 6,234.35 పాయింట్లు (8.15 శాతం), నిఫ్టీ 1,982.45 (8.52 శాతం) పాయింట్లు పడిపోయాయి. ఇప్పటికీ ఇవే ఇంట్రా-డే లో రికార్డులు.
- 2024 జూన్ 4న బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో రూ.31,07,806.27 కోట్లు క్షీణించింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోవడం మదుపరులను తీవ్రంగా నిరాశపర్చింది. ఆ క్రమంలో నెలకొన్న అమ్మకాల ఒత్తిడే పీకల్లోతు నష్టాల్లో మార్కెట్లను ముంచేసింది.
- 2020 మార్చి 23న కరోనా కారణంగా లాక్‌డౌన్ విధించడంతో తొలిసారి 13 శాతానికిపైగా సెన్సెక్స్, నిఫ్టీ దిగజారాయి.
- ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా సెన్సెక్స్ 5,001.11, నిఫ్టీ 1,483.20 పాయింట్లు దిగజారాయి. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.52,69,445.69 కోట్లు కరిగిపోయింది.
- సోమవారం ట్రేడింగ్‌లో హిందుస్థాన్ యునీలివర్ మినహా నష్టాల్లోనే ముగిసిన అన్ని సెన్సెక్స్ షేర్లు. టాటా స్టీల్ షేర్ విలువ గరిష్ఠంగా 7.33 శాతం నష్టపోయింది. ఆ తర్వాత ఎల్ అండ్‌టీ షేర్ 5.78 శాతం పడిపోయింది.
- టాటా మోటర్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు పెద్ద ఎత్తున నష్టాలను మూటగట్టుకున్నాయి.
- బీఎస్ఈలో నమోదైన స్టాక్స్‌లో 3,515 నష్టపోయాయి. 570 పెరిగితే, 140 యథాతథంగా ఉన్నాయి. ఇక 775 షేర్ల విలువ 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకింది.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 4.13 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 3.46 శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) వేల కోట్ల రూపాయల్లో పెట్టుబడులను వెనుకకు తీసుకుంటున్నారు.
- అమెరికా సుంకాలకు దీటుగా చైనా ప్రతిస్పందనతో వాణిజ్య యుద్ధానికితోడు ఆర్థిక మందగమనం భయాలూ మదుపరులను వెంటాడుతున్నాయి.




ముంబై, ఏప్రిల్ 7: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భీకర నష్టాలను చవిచూశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సృష్టించిన టారిఫ్ ప్రకంపనలు యావత్తు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఈ ప్రభావం భారతీయ సూచీలపైనా పడింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,226.79 పాయింట్లు లేదా 2.95 శాతం నష్టపోయి 73,137.90 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ఆరంభంలోనైతే ఏకంగా 3,939.68 పాయింట్లు (5.22 శాతం) కోల్పోవడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ కూడా 742.85 పాయింట్లు లేదా 3.24 శాతం పడిపోయి 22,161.60 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 1,160.80 పాయింట్లు (5.06 శాతం) క్షీణించింది. దీంతో గత ఏడాది జూన్ 4 (10 నెలలు) తర్వాత ఈ స్థాయిలో సూచీలు కుదేలవడం ఇదే తొలిసారైంది. ఉదయం ఆరంభం నుంచే భారీ నష్టాల్లో కదలాడిన సూచీలు.. ఏ దశలోనూ లాభాల్లోకి రాలేకపోయాయి. అయితే సమయం గడుస్తున్నకొద్దీ నష్టాల తీవ్రత మాత్రం తగ్గింది. కాగా, ఈ నెల 2న ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలను ట్రంప్ ప్రకటించిన సంగతి విదితమే. అయితే దీనికి బదులిస్తూ చైనా కూడా దీటుగా స్పందించింది. దీంతో ఆర్థిక మందగమనం భయాలు ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌ను హీటెక్కించాయి. ఇదే సమయంలో ఇన్వెస్టర్లను ట్రేడ్‌వార్ భయాలూ చుట్టుముట్టాయి. అలా చెలరేగిన అమ్మకాల ఒత్తిడే మండే మార్కెట్లను ముంచేసింది.

### రూ.14 లక్షల కోట్లు ఆవిరి

*దేశీయ ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలడంతో మదుపరులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే లక్షల కోట్ల సంపదను కోల్పోయిన ఇన్వెస్టర్లకు సోమవారం మరో రూ.14 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. సూచీల ప్రారంభంలోనే రూ.20 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు చివరకు మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.14,09,225.71 కోట్లు కరిగిపోయి రూ.3,89,25,660.75 కోట్ల(4.54 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది.*



### ఏడాది కనిష్ఠానికి 775 సూచీలు

టారిఫ్‌ల దెబ్బకు దేశీయ స్టాక్ మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. 775 షేర్లు అయితే ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి. వీటిలో దేశీయ అగ్రగామి సంస్థయైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఉన్నది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ఠ స్థాయి రూ.1,115.55కి పడిపోయిన ఆర్ఐఎల్ షేరు చివరకు 4.13 శాతం నష్టంతో రూ.1,155 వద్ద ముగిసింది. అలాగే టీసీఎస్ 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.3,060.25కి జారుకోగా, ఇన్ఫోసిస్ షేరు కూడా రూ.1,307.10కి పడిపోయింది. వీటితోపాటు లార్సెన్ అండ్ టుబ్రో, టాటా గ్రూపునకు చెందిన టైటాన్, టాటా మోటర్స్ షేర్లు భారీగా నష్టపోవడంతో వీటి మార్కెట్ విలువ రూ.41.81 లక్షల కోట్లు ఆవిరైంది. అయినప్పటికీ 59 కంపెనీల షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకోవడం విశేషం.

### స్వయంగా చేసుకున్న గాయాలు: జైరాం రమేశ్

స్టాక్ మార్కెట్లు భారీగా పతనం కావడానికి మోదీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ విమర్శించింది. మార్కెట్లు నష్టపోవటం చూసి తనకు ఎలాంటి ఆశ్చర్యం కలగలేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు. ఆర్థిక వ్యవస్థల పతనం.. స్వయంగా చేసుకున్న గాయాలుగా ఆయన అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోదీ చర్యల కారణంగా మార్కెట్లు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నాయని ఆరోపించారు. టారిఫ్‌లకు తగ్గట్టుగానే మార్కెట్లు స్పందిస్తున్నాయని అన్నారు. 'ప్రధాని మోదీ, డొనాల్డ్ ట్రంప్ మంచి స్నేహితులుగా అభివర్ణించటంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే.. ఇద్దరూ తమ ఆర్థిక వ్యవస్థలు పతనం కావడానికి స్వయంగా సమస్యలు సృష్టించుకోవటంలో నిపుణులు.

#### ప్రధాన ఆసియా మార్కెట్లలో..

| సూచీ | దేశం | నష్టం |
|---|---|---|
| హ్యాంగ్‌సెంగ్ | హాంకాంగ్ | 13.22% |
| నికీ | జపాన్ | 7.83% |
| ఎస్ఎస్ఈ | చైనా | 7.34% |
| కోస్పీ | ద.కొరియా | 5.57% |
| టీపీఐఈఎక్స్ | తైవాన్ | 9.70% |
| ఎస్‌జీఎక్స్ | సింగపూర్ | 9.45% |


### చేదుగా ఉన్నా మందు వేసుకోవాల్సిందే: ట్రంప్

వ్యాధి నయం కావాలంటే మందు చేదుగా ఉన్నప్పటికీ, తీసుకోవలసిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఆయన ఇటీవల వివిధ దేశాల దిగుమతులపై సుంకాలను విధించడంతో అమెరికా సహా ప్రపంచ దేశాల మార్కెట్లు కుదేలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాణిజ్యలోటు గాడిలో పడే వరకు సుంకాలను తగ్గించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ మార్కెట్ల పతనాన్ని తాను కోరుకోలేదని, భారీ అమ్మకాల గురించి ఆందోళనకు గురికావడం లేదని చెప్పారు. తాను ఐరోపా, ఆసియా దేశాల అధినేతలతో చర్చించానని, ఇప్పుడు వారంతా అమెరికాతో ఒప్పందాల కోసం ఆత్రుతపడుతున్నారని తెలిపారు.

## మెటల్ షేర్లు మటాష్

**మెటల్** షేర్లను మదుపరులు గట్టిగానే దూరం పెట్టారు. దీంతో బీఎస్ఈలో మెటల్ సూచీ గరిష్ఠంగా 6.22 శాతం నష్టపోయింది. నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ షేర్ విలువ అత్యధికంగా 8.18 శాతం పడిపోగా, ఆ తర్వాత టాటా స్టీల్ 7.73 శాతం, జేఎస్ డబ్ల్యూ స్టీల్ 7.58 శాతం, సెయిల్ 7.06 శాతం, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ 6.90 శాతం చొప్పున క్షీణించాయి. వేదాంత, జిందాల్ స్టెయిన్‌లెస్, హిందాల్కో, ఎన్ఎండీసీ, హిందుస్థాన్ జింక్ షేర్లూ నిరాశపర్చాయి. అలాగే ఐటీ షేర్లలో ఆన్‌వర్డ్ టెక్నాలజీస్ లిమిటెడ్ షేర్ విలువ గరిష్ఠంగా 13.99 శాతం పడిపోయింది. జెన్సెస్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ షేర్ కూడా 10.80 శాతం నష్టాలను చవిచూసింది. టాటా టెక్నాలజీస్ (6.19 శాతం), ఎంఫసిస్ (5.76 శాతం) షేర్లూ కుదేలయ్యాయి. సెన్సెక్స్‌లో ఇన్ఫోసిస్ 3.75 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 3.27 శాతం, టెక్ మహీంద్రా 2.47 శాతం, ఎల్‌టీఐమైండ్‌ట్రీ 1.72 శాతం, విప్రో 1.38 శాతం, టీసీఎస్ 0.69 శాతం చొప్పున క్షీణించాయి.

## ట్రంప్ వచ్చిన తర్వాత లక్షల కోట్లు ఢమాల్



**దేశీయ** మదుపరులకు గడ్డుకాలం ఇది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఇప్పటి వరకు మదుపరులకు నిరాశనే మిగిల్చింది. ఈ ఏడాది జనవరి 20 నుంచి ఇప్పటి వరకు సూచీలు భీకరనష్టాల్లోకి జారుకోవడంతో మదుపరులు ఏకంగా రూ.45 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. జనవరి 20న బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.4,31,59,726 కోట్లుగా ఉండగా, ప్రస్తుతం ఇది రూ.3,86,01,961 కోట్లకు పడిపోయింది. నికరంగారూ.45 లక్షల కోట్లకు పైగా తగ్గిపోయింది. ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం స్టాక్ మార్కెట్లకు రుచించడం లేదు. ఆయన వివాదాస్పద నిర్ణయాలు ఒక్కొక్కటి తీసుకుంటుండటం ప్రపంచ ఈక్విటీ మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నది. హెచ్1-బీ వీసాలపై కఠిన నిబంధనలు విధించడంతోపాటు ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెరలేపడం, మరోసారి అమెరికా ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే అవకాశాలున్నట్లు వస్తున్న వార్తలు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లను షేక్ చేస్తున్నది.


## ఎగుమతులకు యూఎస్ టారిఫ్ సెగ: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: అమెరికా సుంకాలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం దేశీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ఈ సుంకాల పెంపుతో అమెరికాకు ఎగుమతి అవుతున్న సముద్రపు ఉత్పత్తులతోపాటు బంగారం, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఎగుమతులు 5.76 బిలియన్ డాలర్లు తగ్గే అవకాశాలున్నాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షిటేటివ్ (జీటీఆర్ఐ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మిగతా రంగాలైన టెక్స్‌టైల్స్, దుస్తులు, సెరామిక్ ఉత్పత్తులు, ఆర్గానిక కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్ వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. ఏది ఏమైనప్పటికీ ఎంపిక చేసిన ఉత్పత్తి విభాగాల్లో దేశీయ పోటీతత్వ స్థానం మెరుగుపడే అవకాశాలున్నాయని పేర్కొంది. దేశీయ దిగుమతులపై 26 శాతం సుంకం విధిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఫార్మా, సెమికండక్టర్లు, ఎంపిక చేసిన ఎనర్జీ ఉత్పత్తులకు మినహాయింపునిచ్చింది. ప్రస్తుత గణాంకాల ప్రకారం 2025లో అమెరికా ఎగుమతులు 5.76 బిలియన్ డాలర్లు లేదా 6.41 శాతం తగ్గే అవకాశమున్నదని తెలిపింది. 2024లో భారత్ నుంచి 89.81 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. వీటిలో సముద్రపు ఉత్పత్తులు అధికంగా ఉండటం విశేషం.

## భయం వీడు.. కదులు ముందుకు


న్యూఢిల్లీ/ముంబై, ఏప్రిల్ 7: స్టాక్ మార్కెట్లను ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు షేక్ చేస్తున్నాయి. కొనుగోళ్లను పక్కనపెట్టి మదుపరులు అమ్మకాలకు తెగబడుతున్నారు. సోమవారం నాటి నష్టాలే ఇందుకు నిదర్శనం. ఉదయం ఆరంభం నుంచే సెల్లింగ్ ప్రెషర్‌లోకి జారుకున్న ఇన్వెస్టర్లు.. సూచీలను గడిచిన 10 నెలల్లో ఎన్నడూ లేనంత నష్టాల్లోకి నెట్టేశారు. ఓవైపు ఆర్థిక మందగమనం ఛాయలు, మరోవైపు వాణిజ్య యుద్ధం భయాలు చుట్టుముడుతున్న నేపథ్యంలో మదుపరులకు నిపుణులు పలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. వాటిని పరిశీలిస్తే..

### మార్కెట్ నష్టాల నడుమ మదుపరులకు నిపుణులిస్తున్న సలహాలివే..




భారతీయ మార్కెట్లకు ఇది 'బ్లాక్ మండే'. అమ్మకాల దెబ్బకు సూచీలు వణికిపోయాయి. అయితే మదుపరులు, ట్రేడర్లు సంయమనంతో వ్యవహరిస్తే.. ఈ భయోత్పాతం నుంచి తప్పించుకోవచ్చు. ఏదో జరుగబోతున్నదని భయపడి అమ్మకాలకు దిగవద్దు. సిప్‌లను కొనసాగించాలి. డిస్కౌంట్ ధరల్లో బలమైన, స్థిరమైన షేర్లను కొనడంపై దృష్టిపెట్టాలి.

**-ప్రణయ్ అగర్వాల్, స్టాక్స్‌కార్ట్ సీఈవో**




ప్రస్తుత పరిస్థితులను చూసి మదుపరులు భయపడవద్దు. అయితే పెట్టుబడులపట్ల మాత్రం అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇది అనిశ్చిత పరిస్థితే అని చెప్పవచ్చు. ఎందుకంటే ముమ్ముందు ఏం జరుగుతుందో మనకు తెలియదు. అమెరికా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలు వస్తాయో ఊహించలేకుండా ఉన్నది. అందుకే సంప్రదాయ సాంకేతిక, ఫండమెంటల్ పారామీటర్స్ ఇక్కడ పనిస్తాయని చెప్పలేము. కానీ సిప్‌లలో పెట్టుబడులను కొనసాగించవచ్చు.

**-మనీశ్, మీరే అసెట్ క్యాపిటల్ డైరెక్టర్**



మదుపరులు కొన్ని విషయాలను తప్పక గుర్తుంచుకోవాలి. అందులో ఒకటి.. ట్రంప్ టారిఫ్‌లు ఎంతోకాలం సాగవు. ఇక రెండోది.. అమెరికాకు భారత ఎగుమతులు దేశ జీడీపీలో కేవలం 2 శాతమే. కాబట్టి భారత్‌పై అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావం పెద్దగా ఉండబోదు. మూడోది.. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల కోసం భారత్ ప్రయత్నిస్తున్నది. ఇది విజయవంతమయ్యే అవకాశాలే కనిపిస్తున్నాయి. అదే జరిగితే టారిఫ్‌లు తగ్గిపోతాయి. టారిఫ్‌లు, ద్రవ్యోల్బణం, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఎప్పుడూ ఉండనే ఉంటాయి. వాటిని దాటుకొని ముందుకెళ్తేనే లాభాలు.

**-వీకే విజయకుమార్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్**



వివిధ దేశాలపై విధించిన సుంకాల పరిమాణాలపై ట్రంప్ మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకుంటారనే అనుకుంటున్నాను. కానీ దీనికి ఎంత సమయం పడుతుంది? అన్నది స్పష్టంగా చెప్పలేము. నిజానికి ప్రభుత్వ విధానాలతో వచ్చే దిద్దుబాట్లు.. కొంతకాలానికి సర్దుకోగలవు. అయితే మార్కెట్లు భయాల గుప్పిట్లో ఉన్నప్పుడే వాల్యుయేషన్స్ ఆకర్షణీయంగా ఉంటాయి. రిటైల్ ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో పెట్టుబడులను కొనసాగించాలన్నదే మా సలహా.

**-ఎస్ నరేన్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ సీఐవో**


## శ్రీమంతులకూ తప్పని తిప్పలు

**దేశీయ** కుబేరులకు 2025 అచ్చిరావడం లేదు. గతేడాది రికార్డు స్థాయిలో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు నూతన సంవత్సరంలో పాతాళంలోకి పడిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చిన నాటి నుంచి సూచీలు అల్లకల్లోలానికి గురయ్యాయి. ఫలితంగా దేశీయ కుబేరులు లక్ష కోట్లకు పైగా సంపదను కోల్పోయినట్లు బ్లూంబర్గ్ బిలియనీర్ల ఇండెక్స్‌లో వెల్లడించింది. దేశీయ శ్రీమంతుల జాబితాలో అగ్రగామిగా వెలుగొందుతున్న ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, శివ్ నాడర్‌ల వేలాది కోట్ల సంపద హరించుకుపోయింది. వీరిలో హెచ్‌సీఎల్ టెక్నాలజీ అధినేత శివ్ నాడర్ అత్యధికంగా రూ.80 వేల కోట్ల పైగా సంపదను కోల్పోయారు. దీంతో ఆయన సంపద 33.4 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ 4.45 బిలియన్ డాలర్ల సంపద హరించుకుపోగా, ముకేశ్ అంబానీ 3.77 బిలియన్ డాలర్ల సంపదను కోల్పోయారు.

#### 2025లో సంపదను కోల్పోయిన దేశీయ శ్రీమంతులు



| వ్యక్తి | సంపద(బిలియన్ డాలర్లలో) |
|---|---|
| శివ్ నాడర్ | 9.71 |
| గౌతమ్ అదానీ | 4.45 |
| ముకేశ్ అంబానీ | 3.77 |




## అమెరికాపై ప్రతి చర్యలు వద్దు

### మోదీ సర్కార్ యోచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: భారతీయ ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 26 శాతం సుంకాలపై ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆలోచన భారత ప్రభుత్వానికి లేదని ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ఉభయ దేశాల మధ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ట్రంప్ విధించిన సుంకాల నుంచి ఉపశమనం కలిగించే మార్గాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, అయితే ఇవి ప్రతీకార చర్యగా ఉండకూడదని భావిస్తున్నదని తన పేరును వెల్లడించడానికి నిరాకరించిన ఆ అధికారి తెలిపారు. అటువంటి ఒప్పందాల కోసం భారత్ కృషి చేస్తున్నదని ఆయన చెప్పారు. ప్రతీకార సుంకాల విషయానికి వస్తే ఇతర ఆసియా దేశాలైన చైనా, వియత్నాం, ఇండోనేషియాతో పోలిస్తే భారత్ మెరుగైన స్థానంలో ఉందని, ఇది మనకు ప్రయోజనకర అంశమని ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నెల 2న భారత్‌తోసహా అనేక దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించారు. అమెరికాలో దిగుమతి అయ్యే ప్రతి వస్తువుపై కనిష్ఠంగా 10 శాతం నుంచి గరిష్ఠంగా 49 శాతం వరకు సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ వెల్లడించారు. అమెరికా నుంచి భారత్ 52 శాతం సుంకాలు వసూలు చేస్తున్నదని, అందుకే ఆ దేశంపై 26 శాతం సుంకాలు విధిస్తున్నామని ఆయన తెలిపారు. దీనిపై ఇప్పటికే భారత ప్రభుత్వం, వైట్ హౌస్ మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి.

## శాంతించిన పసిడి

### తులంపై రూ.1,550 తగ్గుదల



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: ఈక్విటీ మార్కెట్లతో పాటు బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో పుత్తడి ధర ఒకేరోజు రూ.1,500కి పైగా పడిపోయింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.1,550 తగ్గి రూ.91,450కి పరిమితమైనట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. గతవారంలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.93 వేల స్థాయిలో ఉండగా, ప్రస్తుతం రూ.92 వేల దిగువకు పడిపోయింది. ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలడంతో మరోసారి ఆర్థిక మాంద్యం గుప్పిట్లోకి ప్రపంచ దేశాలు వెళ్లే అవకాశం ఉన్నదన్న ఆందోళనలు మదుపరులో నెలకొన్నాయని, ఫలితంగా విక్రయాలకు మొగ్గు చూపడం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఉన్నతాధికారి సౌమిల్ గాంధీ తెలిపారు. పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్ పూర్తిగా దెబ్బతిన్నదని, వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులపై అమెరికా స్పష్టతనిచ్చే అవకాశం కోసం మదుపరులు వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారని చెప్పారు. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో తులం ధర రూ.280 దిగి రూ.90,380గా నమోదైంది.

### వెండిది కూడా అదే దారి

వరుసగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు సోమవారం కూడా భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో కిలో వెండి రూ.3,000 దిగొచ్చి రూ.92,500కి పరిమితమైంది. గత ఐదు సెషన్లలో వెండి రూ.10,500 తగ్గినట్టు అయింది. ఇటు హైదరాబాద్‌లో కిలోవెండి రూ.1.03 లక్షలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 10.16 డాలర్లు తగ్గి 3,027.20 డాలర్లకు పరిమితమవగా, వెండి 30.04 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.